క్లుప్తంగా

ప్రత్యేక పూజలు

మల్హర్: మండలంలోని పెద్దతుండ్లలో శుక్రవారం నిర్వహించిన శ్రీ వారాహిదేవి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన, నవగ్రహ యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాల్లో టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఇప్ప మొండయ్య, ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేశ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కోట రాజబాబు, రాహుల్, భక్తులు పాల్గొన్నారు.

నియామకం



చిట్యాల: గ్రామ పంచాయతీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా మండలంలోని గుంటురుపల్లికి చెందిన కారోబార్ యుగేందర్‌ను నియమించినట్లు రాష్ట్ర పంచాయతీ ఎంప్లాయీస్ యూనైటెడ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు సాదుల శ్రీకాంత్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తనకు బాధ్యతలు అప్పగించిన ప్రతి ఒక్కరికీ యుగేందర్ కృతజ్ఞతలు తెలిపారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



టేకుమట్ల: మండలంలోని అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అవసరమయ్యే మౌలిక సదుపాయాలను కల్పించాలని ఎమ్మార్పీఎస్ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రతీ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యుతో పాటు, ఫ్యాన్లు, వెంటిలేషన్, శానిటేషన్, తదితర మౌలిక వసతులు కల్పించాలని కోరారు. మండలంలోని చాలా పాఠశాలల్లో వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు రేనుకుంట్ల రాము, బొజ్జపెల్లి ప్రభాకర్ ఉన్నారు.

పరామర్శ



ప్రకాశ్‌రెడ్డిని పరామర్శిస్తున్న నాయకులు

మల్హర్: మండలంలోని వల్లెంకుంటకు చెందిన రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అయిత ప్రకాశ్‌రెడ్డి తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో బాధిత కుటుంబాన్ని టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబు శుక్రవారం పరామర్శించారు. ఉపాధిహామీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ దండు రమేశ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి అయిత రాజిరెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు గడ్డం క్రాంతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాటారంలో..



పరామర్శిస్తున్న పుట్ట మధు

కాటారం: మండల కేంద్రానికి చెందిన లచ్చయ్య, బయ్యారానికి చెందిన శరత్ ఇటీవల మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబాలను శుక్రవారం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు పరామర్శించారు. అలాగే ఎర్రగుంటపల్లిలో రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న గుర్రాల నరసింహులు దంపతులను, గారెపల్లిలో లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న మేకల అశోక్‌ను పుట్ట మధు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. జక్కు రాకేశ్, మండల ఇన్‌చార్జ్ జోడు శ్రీనివాస్, తోట జనార్దన్, జక్కు శ్రావణ్, తైనేని సతీశ్, వంగల రాజేందర్, ఉప్పు సంతోష్ ఉన్నారు.

పునర్నిర్మాణం ఎప్పుడో?



టేకుమట్ల చలివాగు వద్ద ధ్వంసమైన వైకుంఠధామం



ఎంపేడులో ధ్వంసమైన వైకుంఠధామం

- చలివాగు ఉధృతికి ధ్వంసమైన వైకుంఠధామాలు
- వాగులోనే దహన సంస్కారాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు

టేకుమట్ల: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో గత ప్రభుత్వం మండలంలోని ప్రతీ గ్రామంలో వైకుంఠధామాలు నిర్మించింది. కాగా, రెండు సంవత్సరాల క్రితం చలివాగులో నీటి ఉధృతికి చలివాగు పరివాహక గ్రామాలైన టేకుమట్ల, సుబ్బక్కపల్లె, ఎంపేడు, గుమ్మడవెల్లిలో వైకుంఠధామాలు పూర్తిగా ధ్వంసం కాగా రాఘవరెడ్డిపేట, ఆసిరెడ్డిపల్లి, సుబ్బక్కపల్లి, సోమనపల్లి, అంకుషాపూర్‌లో స్వల్పంగా ధ్వంసమయ్యాయి. ఇప్పటివరకు మండలంలో ధ్వంసమైన వైకుంఠధామాల పునర్నిర్మాణం కోసం అధికారులు, పాలకులు చొరవ చూపకపోవడంతో అలంకారప్రాయంగా మిగిలాయి.

దహన సంస్కారాలకు తప్పనితిప్పలు

మండలంలోని చలివాగు పరివాహక గ్రామాల్లో వైకుంఠధామాలు ధ్వంసం కావడంతో ఆయా గ్రామాల్లో మృతి చెందిన వారిని చలివాగులోనే దహనం చేస్తు తిప్పలు పడుతున్నారు. చలివాగు మానేరు పరివాహక ప్రాంత గ్రామాల ప్రజలు చలివాగు, మానేరుల నుంచి వచ్చే నీటిని తాగు నీటిని వినియోగించుకుంటారు. దహన సంస్కారాలు చలివాగు మానేరులో చేయడం వల్ల నీరు కలుషితమై ప్రజలు వ్యాధులబారిన పడే అవకాశం ఉంది. అలాగే మరికొన్ని గ్రామాల్లో వైకుంఠధామాల్లో సరైన వసతులు లేక వినియోగించకుండా ప్రధాన రోడ్ల వెంట దహన సంస్కారాలు చేపడుతుండడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ధ్వంసమైన వైకుంఠధామాలకు నిధులను కేటాయించి పునర్నిర్మించి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

నేలమట్టమైంది..



రెండు సంవత్సరాల క్రితం వచ్చిన వరదలకు చలివాగు పొంగి వైకుంఠధామం పూర్తిగా నేలమట్టమైంది. కనీసం ప్రారంభం కూడా కాకముందే వైకుంఠధామం నేలమట్టం కావడంతో మృతదేహాలను చలివాగులోనే దహనం చేస్తున్నారు. దీనివల్ల నీరు కలుషితమవుతుంది. వైకుంఠధామాన్ని పునర్నిర్మించి వినియోగంలోకి తీసుకురావాలి.

\- సలికొమ్ముల ప్రభాకర్, టేకుమట్ల

నివేదిక పంపించాం..



వరదల కారణంగా ధ్వంసమైన వైకుంఠధామాల వివరాలను జిల్లా అధికారులకు నివేదిక పంపించాం. ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. నిధులు మంజూరు కాగానే పునర్నిర్మిస్తాం.

-గౌడ సురేశ్, ఎంపీడీఓ, టేకుమట్ల

ఘనంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు



రేగొండ: కొడవటంచ ఆలయంలో వరలక్ష్మీ వ్రతంలో పాల్గొన్న మహిళలు

రేగొండ: మండలంలోని కొడవటంచ ఆలయంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఘనంగా నిర్వహించారు. వందలాది మహిళ భక్తులు సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. ప్రత్యేక వేదికపై ఏర్పాటు చేసిన వరలక్ష్మీ విగ్రహం వద్ద ఆలయ అర్చకులు వ్రతాలు నిర్వహిస్తూ మంత్రోచ్ఛారణలతో భక్తులు వ్రతాలు చేయించారు. అనంతరం నీవేదన, తీర్థప్రసాదాలు వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ మహేశ్, ఆలయ సిబ్బంది శ్రావణ్, సుధాకర్, రాజు, అధిక సంఖ్యలో మహిళ భక్తులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంలోని శ్రీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో ఘనంగా వరలక్ష్మీ వ్రతం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



టేకుమట్లలో..

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

రేగొండ: మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన మొటం భారతి రేగొండ నుంచి పరకాలకి వెళ్తుండగా ఫోన్ ఎక్కడో పోగొట్టుకుంది. దీంతో స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు సీఈఐఆర్ సెల్‌ఫోన్‌ను గుర్తించారు. ఈ మేరకు బాధితురాలికి కుటుంబ సభ్యులకు శుక్రవారం ఎస్సై సందీప్‌కుమార్ అందజేశారు. ఎవరైనా సెల్‌ఫోన్ పోగొట్టుకున్నా, దొంగతనానికి గురైనా ఫోన్ వివరాలు సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని ఎస్సై సూచించారు. ఈ పోర్టల్ ద్వారా ఫోన్ తిరిగి పొందే అవకాశం ఉందని తెలిపారు.



బాధితురాలి కుటుంబ సభ్యులకు ఫోన్ ఇస్తున్న ఎస్సై

అపరిశుభ్రంగా పాఠశాల పరిసరాలు

- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

భూపాలపల్లి రూరల్: పాఠశాల పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని మైనారిటీ గురుకుల పాఠశాల–కళాశాలను శుక్రవారం మాజీ ఎమ్మెల్యే సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. స్కూల్ ప్రాంగణం మొత్తం పిచ్చి మొక్కలతో నిండి ఉందన్నారు. క్లాసు రూముల్లో వెలుతురు లేదన్నారు. గదుల్లో సీలింగ్ ఎత్తు తక్కువగా ఉండడంతో బెడ్స్ సీలింగ్‌కు తగులుతున్నాయని దీంతో విద్యార్థులు బెడ్స్ వాడటం లేదని అన్నారు. బెడ్స్ ఉండి కూడా విద్యార్థులు నేలపై పడుకోవడం దురదృష్టకరమని తెలిపారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్, జిల్లా యంత్రాంగాన్ని కోరారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల పరిసరాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి

నాణ్యమైన భోజనం అందించాలి



చిట్యాల: విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంపీఓ రామకృష్ణ



కాటారం: వంట సామగ్రిని పరిశీలిస్తున్న తహసీల్దార్ నాగరాజు

- తహసీల్దార్ నాగరాజు

కాటారం: విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ నాగరాజు సూచించారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతి బా పూలే బాలుర పాఠశాలను శుక్రవారం తహసీల్దార్ తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, వంట గది, డైనింగ్ హాల్‌లో పరిశుభ్రతను పరిశీలించారు. వంట సామగ్రి, కూరగాయలు, ఆహార పదార్థాల నాణ్యతను చూశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, విద్యా బోధనపై ఆరా తీశారు. విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వర్షాకాలంలో విద్యార్థుల ఆరోగ్యంపై అప్రమత్తంగా ఉండాలని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులకు సూచించారు. తహసీల్దార్ వెంట ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

ఎస్సీ హాస్టల్ తనిఖీ

గణపురం: మండల కేంద్రంలోని ఎస్సీ హాస్టల్‌ను గణపురం తహసీల్దార్ సత్యనారాయణ స్వామి ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గృహంలోని వంట గదిని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనాన్ని అందిస్తున్నారా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు.

మొగుళ్లపల్లి: మండల కేంద్రంలోని మహాత్మజ్యోతిబాపూలే సంక్షేమ పాఠశాలను ఎంపీడీఓ సురేందర్ సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదులను, మరుగుదొడ్లను, ఆర్వో ప్లాంట్‌ను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని కోరారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఆయన వెంట పలువురు అధికారులు ఉన్నారు.



మొగుళ్లపల్లి: విద్యార్థులతో భోజనం చేస్తున్న ఎంపీడీఓ సురేందర్

కేజీబీవీ తనిఖీ..

చిట్యాల: మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ బాలికల విద్యాలయాన్ని ఎంపీఓ రామకృష్ణ సందర్శించారు. విద్యార్థినులకు నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందిని కోరారు. అనంతరం తరగతి గదులను, వంటగదిని, కూరగాయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

ముందస్తు రాఖీ వేడుకలు



రేగొండ: రాఖీలు కడుతున్న విద్యార్థినులు



మల్హర్‌లో..



కాటారం:శ్రీనుబాబుకు రాఖీ కడుతున్న తిరుమల

రేగొండ: మండల కేంద్రంలోని వాణి విద్యానికేతన్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు రజనీకుమార్ ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు రాఖీ పండగ విశిష్టతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శోభన్, రమేశ్, రాజు, రవీందర్, తిరుపతి, స్వప్న, కరుణశ్రీ పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని వల్లెకుంట దేవి విద్యోదయ విద్యాలయంలో కరస్పాండెంట్ రాజు ఆధ్వర్యంలో ముందస్తు రాఖీ పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాఖీ పౌర్ణమి పండుగ విశిష్టతను, అన్నాచెల్లెల అనుబంధం ప్రాముఖ్యతను కరస్పాండెంట్ విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

కాటారం: రాఖీ పండుగ వేడుకల్లో భాగంగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీనుబాబుకు కాటారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పంతకాని తిరుమల రాఖీ కట్టారు. మల్హర్ మండల పర్యటనకు వచ్చిన శ్రీనుబాబును ఏఎంసీ చైర్‌పర్సన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా నియామకమైన ఏఎంసీ చైర్‌పర్సన్‌ను శ్రీనుబాబు సన్మానించి అభినందనలు తెలిపారు. అనంతరం చైర్‌పర్సన్ తిరుమల రాఖీ కట్టి శ్రీనుబాబుకు శుభాకాంక్షలు తెలిపారు. గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ కోట రాజబాబు, మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య పాల్గొన్నారు.

ఏబీవీపీ ఆధ్వర్యంలో..

చిట్యాల: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్(ఏబీవీపీ) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పాఠశాల, కళాశాలలో రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను సందర్శించి విద్యార్థినులతో రాఖీ కట్టించుకున్నారు. ఏబీవీపీ నగర కార్యదర్శి బుర్ర అభిజ్ఞ, నాయకులు అవినాష్, అజేయ్, మనోజ్, శేషివర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మండలంలోని ఆజాంనగర్‌లోని మహర్షి పాఠశాలలో ముందస్తుగా రక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు రాఖీలు కట్టారు. ప్రధానోపాధ్యాయుడు అశోక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

టేకుమట్ల: మండల కేంద్రంలో కానిస్టేబుళ్లకు, విధులు ముగించుకుని ఇంటికి రెవెన్యూ ఉద్యోగికి మహిళలు రాఖీ కట్టారు. ఈ సందర్భంగా స్వీట్లు తినిపంచి ఆప్యాయతను చూపారు.

రాఖీ సందడి



రాఖీలను కొనుగోలు చేస్తున్న మహిళలు

టేకుమట్ల: మండల కేంద్రంతో పాటు, మండలంలోని పలు గ్రామాల్లో రాఖీ సందడి ప్రారంభమైంది. శుక్రవారం మండల కేంద్రంలో దుకాణాదారులు రాఖీ స్టాళ్లను ఏర్పాటు చేసి విక్రయాలు ప్రారంభించడంతో సందడిగా మారింది. ఉదయం నుంచి రాత్రి వరకు రాఖీ స్టాళ్ల ఆడపడుచులతో రద్దీగా మారాయి.



చిట్యాలలో..



భూపాలపల్లి రూరల్: ఆజాంనగర్‌లో..



టేకుమట్ల: రాఖీ కడుతున్న మహిళలు

11న అప్రెంటిస్‌షిప్ మేళా

కాటారం: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 11న ప్రైమ్ మినిస్టర్ నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ గోలి తిరుపతి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో పేర్లు నమోదు చేసుకొని మేళాకు హాజరు కావాలని సూచించారు. బయోడెటా ఫాంతో పాటు అప్లికేషన్ రిజిస్ట్రేషన్ కాపీ, ఎస్సెస్సీ, ఐటీఐ మెమో, ఎన్టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్‌కార్డు, రెండు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు వెంట తీసుకొని రావాలని ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ మేళకు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారని పేర్కొన్నారు.

విద్యార్థులకు అభినందన

కాటారం: రాష్ట్ర అథ్లెటిక్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులను శుక్రవారం కళాశాల ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, పీడీ గౌతమి అభినందించారు. జనగామ జిల్లా కేంద్రంలో ఈ నెల 7న నిర్వహించిన తెలంగాణ 4వ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్-2025 పోటీల్లో గురుకులం విద్యార్థులు పాల్గొని అండర్-16 జావెలిన్ త్రోలో సిరివల్లి, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో ప్రతిభ కనబర్చి రజత పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థినులు ప్రతిభ కనబర్చడంపై హర్షం వ్యక్తం చేస్తూ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా సన్మానించి మెమొంటోలు అందజేశారు. ఎస్‌వీపీ సరిత, జేవీపీ కల్పన, పీఈటీ శ్రీవిద్య, ఉపాధ్యాయునులు పాల్గొన్నారు.



అభినందిస్తున్న ప్రిన్సిపాల్ నాగలక్ష్మి

అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటుచేయాలి

చిట్యాల: మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ జిల్లా కార్యదర్శి మారపెల్లి మల్లేశ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో ఉన్న అగ్నిమాపక కేంద్రం చిట్యాల, టేకుమట్ల, మొగుళ్లపల్లి మండలాలకు సుమారు 35 కిలోమీటర్లు ఉందని దీంతో అగ్రిమాపక యంత్రం వచ్చే సరికి భారీ నష్టం జరుగుతుందని అన్నారు. ఇటీవల టేకుమట్లలో మారుతి ఫ్యాషన్ బట్టల దుకాణంలో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో షాపు దగ్ధమైందన్నారు. అందుబాటులో అగ్నిమాపక యంత్రం లేకపోవడంతో భారీ నష్టం వాటిల్లిందన్నారు. గతంలో కూడా అగ్నిప్రమాదంలో ఇళ్లు కాలిపోయాయని అన్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి చిట్యాల మండల కేంద్రంలో అగ్నిమాపక కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.

సుభాష్ కాలనీ ప్రధాన రహదారిపై పశువులు



రాత్రివేళ బస్టాండ్ సమీపంలోని చౌరస్తాలో పశువులు



రోడ్లపైనే పశువులు

భూపాలపల్లి పట్టణంలోని ప్రధాన రహదారులపై పశువులు స్వైర విహారం చేస్తున్నాయి. ఆవులు, ఎడ్లు, కుక్కలు, పందులు రోడ్లపైనే తిరుగుతున్నాయి. దీంతో రాత్రి వేళల్లో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. కుక్కలు గుంపులు గుంపులుగా వాహనాల వెంట పడుతుండడంతో ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

\- భూపాలపల్లి



పోలీస్ స్టేషన్ రహదారిపై కుక్కల స్వైరవిహారం